క్లుప్తంగా

ఘనంగా కట్లమ్మ తల్లి తీర్థం



ప్రత్యేక అలంకరణలో కట్లమ్మ తల్లి

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామ దేవత కట్లమ్మ తల్లి తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పందలపాకతో పాటు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కట్లమ్మ తల్లి తీర్థం సందర్భంగా గ్రామానికి చెందిన ఆడపిల్లలంతా తమ పుట్టింటికి రావడంతో ఇంటింటా సందడి వాతావరణం నెలకొంది.

పీహెచ్‌సీలో కంటి వైద్య శిబిరం



రంగంపేట పీహెచ్‌సీ వద్ద కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రంగంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి మాట్లాడుతూ మండల పరిధిలోని 5 గ్రామ సచివాలయాల నుంచి కంటి సమస్యలు ఉన్నవారిని గుర్తించి వారిని మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి తరలించామన్నారు. అక్కడ కంటి వైద్యాధికారి ఎం.ఇందిర ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షల్లో 9 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించి వారిని రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు తరలించి ఆపరేషన్ చేయించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె. చిన్నారావు, డాక్టర్ కె.సంకీర్తన, సీహెచ్‌ఓ కె.జయమణి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ తయారీపై అవగాహన



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏఓ మణిదీప్

పెదపూడి: మండలంలోని కరకుదురు గ్రామం రైతు భరోసా కేంద్రం వద్ద సిబ్బందికి ఖరీఫ్–2024 యాక్షన్ ప్లాన్ తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ పంట సాగు పద్ధతుల ప్రణాళిక, రైతు భరోసా కేంద్రాల్లో రసాయన ఎరువుల పంపిణీ తదితర అంశాలను వివరించారు. రైతు భరోసా కేంద్రాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను ఏ విధంగా పూర్తి చేయాలో శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేకుంటే కఠిన చర్యలు



సోడా పరిశ్రమలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా కూల్ డ్రింక్స్, సోడా పరిశ్రమలను నిర్వహిస్తే సంబంధిత యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి అన్నారు. పిడింగొయ్యిలోని తేజానగర్‌లో ప్లాట్ 111లో నడుస్తున్న బ్లూవెల్ బేవరేజెస్ అనధికారిక సోడా, డ్రింక్స్ తయారీ యూనిట్‌లో గురువారం విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ, లీగల్, మెట్రాలజీ, రెవెన్యూ అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. ఎస్పీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ బ్లూ వెల్ బేవరేజెస్ సంస్థ యజమాని చెక్క నవదుర్గాభవాని నిమ్మకాయ, ద్రాక్ష, ఆరెంజ్, బ్లూ బెర్రీ, పైనాపిల్ ఫ్లేవర్ సోడాలను చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా తయారు చేస్తూ గాజు సీసాలలో నిల్వ చేస్తున్నారన్నారు. దీనిపై కేసును నమోదు చేశామన్నారు. అలాగే గడువు ముగిసిన ఆర్టిఫీషియల్ ఫ్లేవర్లు దొరికినందున మరో కేసు బుక్ చేశామన్నారు. సదరు సంస్థ ప్యాకర్‌గా నమోదు కానందున, ఉత్పత్తులపై స్టాట్యూటరీ డిక్లరేషన్ లేనందున, ధృవీకరించని తూకం యంత్రం ఉన్నందున కేసులు కట్టామన్నారు.

బూరుగుపూడి గేటుకు ఘన చరిత్ర

- బ్రిటిష్ కాలంలోనే గుర్తింపు
- నాడు కలెక్టర్ కార్యాలయం నిర్వహణ
- నేటికీ తగ్గని ప్రాధాన్యం



బ్రిటిష్ కాలంలో బూరుగుపూడి గేటులోని కలెక్టర్ కార్యాలయం ఇక్కడే ఉండేది



ప్రస్తుతం బూరుగుపూడి గేటులోని ఫారెస్టు రాణా

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్ (బూరుగుపూడి గేటు)కు ఎంతో ఘన చరిత్ర ఉంది. బ్రిటిష్ పాలన నుంచే ఈ ప్రాంతానికి గుర్తింపు ఉండేది. స్వాతంత్ర్యం వచ్చే వరకూ బూరుగుపూడి, మధురపూడి బ్రిటిష్ సైనికుల కార్యకలాపాలకు నిలయాలుగా ఉండేవి. ఇప్పటికీ ఈ ప్రాంతానికి జిల్లాలో ప్రాధాన్యం ఉంది. ప్రస్తుతం అటవీ, వ్యవసాయ, ప్రకృతి సంపదల అక్రమ రవాణాకు అడ్డుకునేందుకు రాణాగా ఏర్పాటు చేశారు. అలాగే వాహనాల తనిఖీలు కూడా జరుగుతాయి.

కలెక్టర్ క్యాంపు కార్యాలయం

బ్రిటిష్ పాలనలో రైతుల సమస్యల పరిష్కారానికి ఇక్కడ కార్యాలయం ఉండేది. ముఖ్యంగా భూముల సమస్యలను పరిష్కరించేవారు. బ్రిటిష్ కాలంలో రెండు లేదా మూడు మండలాలను కలిపి ఫిర్కా అని వ్యవహరించేవారు. ఫిర్కాలో కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఉండేది. దానిలో భాగంగానే బూరుగుపూడి గేటులో క్యాంపు కార్యాలయం నిర్వహించేవారు.

జిల్లాలో 21 ఫిర్కాలు

రాజమహేంద్రవరం, పెద్దాపురం, ఎల్లవరం, సామర్లకోట, కాకినాడ, అమలాపురం కేంద్రాలుగా అప్పట్లో 21 ఫిర్కాలు కొనసాగేవి. బ్రిటిష్ పాలకులు విధించిన పన్నుల చెల్లింపులో జాప్యం జరిగినా, భూమి సమస్యలను నెలకొన్నా ఫిర్కా పరిధిలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయాలలో పరిష్కరించేవారు.

బూరుగుపూడి గేటులో..

భూమి సమస్యల పరిష్కారం కోసం బూరుగుపూడి గేటులో కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఉండేది. ప్రతి శనివారం క్యాంపు కార్యాలయంలో వివాదాలకు పరిష్కారం జరిగేది. ఇక్కడికి రాజానగరం, కోరుకొండ, గోకవరం, సీతానగరం తదితర ప్రాంతాలకు చెందిన రైతులు వచ్చేవారు. రాత్రి వేళల్లో ఇక్కడే బస చేయాల్సి వచ్చేది. రాత్రి 9 గంటలకు ఇక్కడి గేటును మూసేసేవారు. రాత్రి వేళల్లో ఇటుగా రాకపోకలు జరిగేవి కాదు. ఉదయం తెల్లవారుజాము 4 గంటల నుంచి అనుమతి ఇచ్చేవారు. దీంతో రైతులు రాత్రి సమయానికి వచ్చేవారు. ఇక్కడే బస చేసి ఉదయాన్నే తమ సమస్యలను పరిష్కరించుకునేవారు.



బూరుగుపూడి జంక్షన్

బ్రిటిష్ కాలంలోనే ప్రాధాన్యం



బ్రిటిష్ పాలన నుంచే బూరుగుపూడికి ప్రాధాన్యం ఉంది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో రక్షణ కోసం బూరుగుపూడి, మధురపూడి గ్రామాలను బ్రిటిష్ పాలకులు ఎంపిక చేసుకున్నారు. మధురపూడిలో విమానాశ్రయం ఏర్పాటు, బూరుగుపూడిలో సైనికులకు వైద్యం కోసం హాస్పిటళ్లు, క్వార్టర్లు ఉండేవి. బూరుగుపూడి గేటులో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నిర్వహించేవారు.

– తాతపూడి జాకబ్ రాజు, సెక్రటరీ, బూరుగుపూడి

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యం



పెదరాయవరంలో పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

రంగంపేట: జూన్ 4న వెలువడే సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని సుభద్రంపేట, పెదరాయవరం, కోటపాడు, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు కృతజ్ఞత పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్దలతో ప్రత్యేకంగా సమావేశయ్యారు. రాజకీయాలకు అతీతంగా బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అందించామని, సంక్షేమ పాలనకే ప్రజలందరూ మళ్లీ మద్దతు పలికారన్నారు. ఎన్నికల్లో సహకరించిన అందరికీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి మాట్లాడుతూ అధికంగా నమోదైన ఓట్ల శాతం తప్పకుండా ప్రభుత్వ అనుకూలమైన ఓట్లేనన్నారు. అందరూ వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతూ ఓట్ల ప్రభజనం సృష్టించారన్నారు. రానున్న ఫలితాల్లో అధిక సీట్లు కైవసం చేసుకుంటామని ఎమ్మెల్యేగా తిరిగి సూర్యనారాయణరెడ్డి అత్యధిక మెజారిటీ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ఎమ్మెల్యే దంపతులను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందు, గవరసాని రాజు, నల్లా దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐడియా.. అదిరింది..

రాజానగరం: సాధారణంగా ఆలయాలలో జరిగే పూజలు, హోమాలు, అర్చనలు వంటి వాటితో పాటు పలు రకాల ఆధ్మాత్మిక ప్రసంగాలను, ప్రవచనాలను ఊరంతటికీ వినిపించేలా మైకుల స్పీకర్లను ఆయా ఆలయాల పైభాగంలో బిగిస్తారు. దానివల్ల ఆలయం చుట్టుపక్కల ప్రాంతాల వారికి మాత్రమే అవి వినిపిస్తాయి. మండలంలోని పాతతుంగపాడులో ఓ భక్తుడు తమ రామాలయంలో జరిగే ప్రతి కార్యక్రమం ఊరంతటికీ వినిపించాలనుకున్నాడు. ఆలయానికి సంబంధించిన స్పీకర్లను పక్కనే ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు (ఓహెచ్‌ఆర్) పైభాగంలో నాలుగు దిక్కుల వైపు బిగించాడు. దీనితో ఆధ్యాత్మిక ప్రవచనాలను గ్రామమంతా వినిపించేలా చేశాడు. అతడి ఆలోచనను గ్రామస్తులందరూ అభినందిస్తున్నారు.



పాత తుంగపాడులో ఓహెచ్‌ఆర్ వాటర్ ట్యాంకుపై కట్టిన స్పీకర్లు

ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట చర్యలు



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత, ఎస్పీ జగదీష్

- కలెక్టర్ మాధవీలత
- నన్నయలో కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో వచ్చే నెల 4న నిర్వహించే ఓట్ల కౌంటింగ్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత గురువారం పరిశీలించారు. రాజమండ్రి రూరల్, అర్బన్, రాజానగరం, అనపర్తి, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలకు సంబంధించిన స్ట్రాంగ్‌రూమ్‌లను, కౌంటింగ్ కేంద్రాలను, మీడియా విభాగం, కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించి, నోడల్ అధికారులకు సూచనలిచ్చారు. నిరంతర నిఘాలో భాగంగా కమాండ్ కంట్రోల్ కేంద్రంలో సీసీ టీవీలను ఏర్పాటు చేశారు. నిఘా వ్యవస్థ ద్వారా ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లను, ఇతర ముఖ్యమైన ప్రదేశాలను నిరంతరం పర్యవేక్షిస్తుంటారని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. పోటీ చేసిన అభ్యర్థులు, వారికి సంబంధించిన ఏజెంట్లు కూడా ఈ సీసీ టీవీల ద్వారా కదలికలు తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. యూనివర్సిటీ ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల కూడా పోలీసు విభాగానికి చెందిన ఏడు సోలార్ సీసీ కెమోరాలను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రంలోని కంట్రోల్ రూమ్ జిల్లా కలెక్టర్, ఎస్పీల పర్యవేక్షణలో నిరంతరం, నిర్విరామంగా పనిచేస్తుందన్నారు. కౌంటింగ్ వివరాలను మీడియా విభాగం ద్వారా ఎప్పటికప్పుడు అందజేసేలా సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసే ప్రత్యేక స్క్రీన్ ద్వారా కౌంటింగ్ ప్రక్రియను, నిఘా వ్యవస్థను పరిశీలించవచ్చన్నారు.

ప్రశాంతంగా కౌంటింగ్

కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతో పాటు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ఏ ఒక్కరినీ అనుమతించేది లేదన్నారు. యూనివర్సిటీకి ఒక కిలోమీటర్ దూరం వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. జూన్ 6 వరకు అమలులో ఉండేలా జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ ప్రొసీడింగ్స్ జారీ చేశామన్నారు. కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత, 3 టైర్ సెక్యూరిటీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు తేజ్ భరత్, దినేష్ కుమార్, అశుతోష్ శ్రీవాత్సవ్, ఎం.మాధురి, డీఆర్వో డి.నరసింహులు, అదనపు ఎస్పీ ఎల్.చెంచిరెడ్డి, రుడా వీసీ వి.బాలస్వామి, డీఐ పీఆర్వో సీహెచ్ శ్రీనివాస్, పీఆర్వో ఐ.కాశియ్య, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఈత పండ్లు.. తీయని జ్ఞాపకాలు

రాజానగరం: ప్రకృతి సీజనల్ వారీగా మనకు కొన్ని రకాల పండ్లను అందిస్తుంది. వాటిని తినడం ద్వారా ఆయా సీజన్లలో వచ్చే రుగ్మతను తప్పించుకోవచ్చు. ఆ కోవలోనే వేసవిలో మామిడి పండ్లు, తాటిముంజెలతో పాటు ఈతపండ్ల మనకు అందుబాటులోకి వస్తాయి. కానీ నేటితరంలో చాలామందికి ఈతపండ్ల గురించి తెలియదు. ప్రస్తుతం ఐదు పదుల వయస్సు దాటిన వారందరికి ఇవి సుపరిచితమే. వాటిని చూడగానే ఒక్కసారిగా వారి చిన్ననాటి రోజులు గుర్తుకొస్తాయి. నాలుగు దశాబ్దాల క్రిందటి బాల్యం గుర్తుకు వస్తుంది. భుజాన పుస్తకాలు వేసుకుని పాఠశాలలకు మైళ్ల కొద్దీ నడుచుకుంటూ వెళ్లిన రోజులు, సైకిళ్ల పై ఇద్దరు, ముగ్గురు కూర్చుని ప్రయాణించిన రోజులు, వేసవి సెలవులకు అమ్మమ్మల ఇంటికి వెళ్లి, తాతయ్య, మేనమామలు, వారి పిల్లలతో కలిసి తోటల్లో ఆడుకున్న సందర్భాలు, మామిడి కాయలు, తాటి కాయలు కోయించుకుని, అక్కడనే వాటిని ఆరగించిన సందర్భాలు..ఇలా అనేక చిన్ననాటి సంఘటనలు గుర్తుకొస్తున్నాయి. నేటి వారికి ఇటువంటి మధురస్మృతుల గురించి పెద్దగా తెలియదు. సాధారణంగా జీవితంలో ఎవరికైనా మధురమైన జ్ఞాపకాలు ఏమిటి అంటే చిన్ననాటి రోజులే. సీజనల్ పండ్లలో ఒకటైన ఈతపండ్లు ప్రస్తుతం మామిడి, పనస, సపోటా, వంటి పండ్ల మాదిరిగానే జాతీయ రహదారి పక్కన విక్రయిస్తున్నారు. నిజానికి వీటిని సేకరించి, మగ్గపెట్టి పండ్లను విక్రయించడానికి కూడా శ్రద్ధ వహించేవారు ఉండరు. అటువంటిది సీజనల్ వారీ పండ్ల విక్రయాల పైనే జీవనం సాగిస్తున్న కొంతమంది మాత్రం ఒక్క రూపాయి వచ్చినా ఆదాయమే కదా అనే భావంతో, ఆశతో ఈత కాయల గెలలను కోసి, తీసుకువచ్చి అమ్ముతున్నారు. పనస, తాటి ముంజులతో పాటు వీటిని కూడా గుత్తులుగా విక్రయించి సొమ్ములు చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.



విక్రయానికి సిద్ధం చేసిన ఈత పండ్లు

అక్రమ మద్యం, రికార్డులు లేని వాహనాల సీజ్



కార్డన్ అండ్ సెర్చ్‌కు సిద్ధమవుతున్న పోలీసులు

కంబాలచెరువు: జిల్లాలో గురువారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి అక్రమ మద్యం, రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ, సారా నియంత్రణ, అసాంఘిక శక్తుల కార్యకలాపాలను అణిచివేసేందుకు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో జోనల్ డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది టీములుగా ఏర్పడి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా అక్రమంగా నిల్వ ఉంచిన 22 మద్యం సీసాలు, రికార్డులు, నంబర్ ప్లేట్లు లేని 64 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ప్రతి రోజూ ఈ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హోంగార్డు భార్యకు ఉద్యోగం

కంబాలచెరువు: హోంగార్డుల కుటుంబాలకు, పోలీసు సిబ్బందికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. నగరంలో హోంగార్డుగా పనిచేసే కె.నాగ సురేంద్ర ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన భార్య దేవికి హోంగార్డుగా ఉద్యోగం ఇచ్చారు. ఆ నియామక పత్రాన్ని గురువారం దేవికి ఎస్పీ జగదీష్ అందజేశారు. అలాగే జిల్లా హోంగార్డు యూనిట్ తరఫున హోంగార్డుల ఒకరోజు జీతం రూ.1.63 లక్షలను అందించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తామని, మనం అందరం పోలీసు కుటుంబమన్నారు.

ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌కు పటిష్ట భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం రూరల్: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌కు పటిష్ట భద్రత ఉందని రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ అన్నారు. ఆయన గురువారం సాయంత్రం తన చాంబర్‌లో ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై రాజకీయ పార్టీల అభ్యర్థులు, రెవెన్యూ, పోలీసు తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎం యూనిట్లు, స్టాట్యూటరీ మెటీరియల్, పోస్టల్ బ్యాలెట్ పత్రాలను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచామన్నారు. పార్టీ అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో గదులకు సీల్ వేయడం జరిగిందన్నారు. ఆ గదుల డోర్లు, కిటికీలకు కూడా చెక్కలను కొట్టి మూసి ఉంచామన్నారు. ఓట్లు లెక్కించే జూన్ 4వ తేదీ ఉదయం 5 గంటలకు అభ్యర్థులు లేదా వారి ఏజెంట్ల సమక్షంలో గదులను తెరుస్తామన్నారు. పరిశీలకుల సమక్షంలో ఉదయం 5.30 గంటలకు కౌంటింగ్ సిబ్బంది టేబుల్ ఎలాట్ మెంట్ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, వాటిని కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షణ చేస్తామన్నారు. అక్కడ అభ్యర్థులు, ఏజెంట్లు నిరంతరం పరిశీలించడం జరుగుతుందన్నారు. శుక్రవారం నుంచి అభ్యర్థులు, ఏజెంట్లు నేరుగా స్ట్రాంగ్‌రూమ్‌లను తనిఖీ చేసే అవకాశం ఉందని, ఆ మేరకు పోలీసు, గెజిటెడ్ అధికారి ఎస్కార్ట్‌తో పంపనున్నట్లు తెలియజేశారు. మూడు షిఫ్టులలో తహసీల్దార్లను నియమించామన్నారు. నియోజకవర్గంలో 3,033 పోస్టల్ బ్యాలెట్ పోలైనట్లు తెలిపారు. సమావేశంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంగంపేట, రాజానగరం కళాశాలలకు చెందిన మొత్తం 272 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్ష రాయనున్నారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మొదటి ఏడాది, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ రెండో ఏడాది పరీక్షలు జరుగుతాయన్నారు. శుక్రవారం ఉదయం జరిగే తెలుగు, సంస్కృత పరీక్షలకు 69 మంది విద్యార్థులు, మధ్యాహ్నం జరిగే తెలుగు పరీక్షకు 11 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి మృతి



నల్లమోలు పాపారావు (ఫైల్)

సీతానగరం: మండలంలోని కూనవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లమోలు పాపారావు (63) బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన గతంలో పీఏసీఎస్ చైర్ పర్సన్‌గా పనిచేశారు. ప్రస్తుతం రైతు భరోసా చైర్మన్‌గా ఉన్నారు. ఆయన బుధవారం రాజమహేంద్రవరంలో ఉంటున్న పెద్ద కుమారుడి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి 2 గంటలకు గుండెపోటుగా ఉందని చెప్పి, వాంతులు చేసుకొని అపస్మారక స్థితికి వెళ్లారు. హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. స్వగ్రామమైన కూనవరానికి గురువారం ఉదయం మృతదేహాన్ని తరలించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పార్టీ నాయకులు గుర్రాల కృష్ణారావు తదితరులు అంత్యక్రియలలో పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీపీ ..



యార్లగడ్డ లక్ష్మీకాంతం(ఫైల్)

పెదపూడి: పెదపూడి మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు యార్లగడ్డ లక్ష్మీకాంతం(58) గుండెపోటుతో మృతి చెందారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీకాంతం నాలుగు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లి అక్కడ వెన్నుపూస ఆపరేషన్ చేయించుకున్నారు. గురువారం ఉదయం ఒక్కసారిగా గుండెపోటుకు గురై మరణించారు. ఆమె మృతిపై వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు..

సీతానగరం: పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురానికి చెందిన పెనుగుల అబ్బులు (27) చికిత్స పొందుతూ మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ ఎం.గోవిందరాజులు గురువారం తెలిపారు. అబ్బులు ఈ నెల 18వ తేదీన గడ్డి మందు తాగాడు. వెంటనే చుట్టుపక్కల వారు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనుల పరిశీలన

మధురపూడి: ఉపాధి కూలీలకు వేతనం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి రూ.300లకు పెరిగిందని అంబుడ్స్‌మన్ ఖాదర్ బాషా అన్నారు. కోరుకొండ మండలం కోటికేశవరం, బొల్లెద్దుపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ అందరూ జాబ్ కార్డులు కలిగి ఉండాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన 70306 20797 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. అనంతరం ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ సిబ్బందితో మాట్లాడారు.

జెడ్పీ చైర్మన్ విప్పర్తి పరామర్శ



జెడ్పీటీసీ రొంగల పద్మావతి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

బిక్కవోలు: మండల జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి అత్త, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ తల్లి ఎరుకమ్మ ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి కుటుంబ సభ్యులను పందలపాకలోని వారి స్వగృహంలో జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు గురువారం పరామర్శించారు. కార్యక్రమంలో రాయవరం ఏఎంసీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.